సాక్షి నిజామాబాద్

బుధవారం, 16, అక్టోబర్, 2024



మత్స్యకారుల సంక్షేమానికి..
మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు.
- 10లో ▸



దొంగల హల్‌చల్
బోధన్‌కు చెందిన వడ్ల వ్యాపారి ఇంట్లో నుంచి రూ.50లక్షల నగదు, 20తులాల బంగారం ఎత్తుకెళ్లారు.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.3 /21.5

వాతావరణం
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

రేపు జాబ్ మేళా

నిజామాబాద్ నాగారం: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కల్పన కోసం గురువారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి బీపీ మధుసూదన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, పేటీఎం కంపెనీల్లో జూనియర్ కెమిస్ట్, జూనియర్ టెక్నీషియన్, సేల్స్ అండ్ సర్వీస్ పేటీఎం ప్రొడక్ట్ ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు వివరించారు. ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీఎస్సీ కెమిస్ట్రీ, బీకాం, బీఎస్సీ పాసైన వారు అర్హులని, ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా ఉపాధి కార్యాలయంలో 17న ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం లోగా హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు 95817 68413, 99487 48428, 63057 43423, 77022 59070 నంబర్లను సంప్రదించాలని, అభ్యర్థులు తమ వెంట బయెడేటా, ఆధార్ కార్డ్, పదోతరగతి మెమో, ఫొటో తీసుకురావాలన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నుడా చైర్మన్



నిజామాబాద్ సిటీ: నుడా చైర్మన్‌గా నియమితులైన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కేశ వేణు జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో పాటు పలువురు అధికారులను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ హనుమంతును సన్మానించారు. సాయంత్రం సమయంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మకరంద్‌ను కలిశారు. నుడా పరిధి, పనిచేసే అధికారుల వివరాలు, విధి విధానాలను అడిగి తెలుసుకున్నారు. నుడా చైర్మన్ వెంట కాంగ్రెస్ నాయకులు భూమన్న, పార్థసారథి, కొండపాక రాజేశ్, మోపాల్ నర్సయ్య తదితరులున్నారు.

108 అంబులెన్స్‌ల తనిఖీ



నిజామాబాద్ నాగారం: ఈఎంఆర్ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ 108 వాహనాల నిర్వహణ, సేవలను పరిశీలించేందుకు ఎస్‌సీఎం హెడ్ సత్యనారాయణ 108, 102, 1963, ఎఫ్‌హెచ్‌ఎస్ వాహనాలను మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వాహనాల పనితీరు, సిబ్బంది రికార్డులను పరిశీలించారు. ప్రజలకు నిరంతరాయంగా సేవలందించేందుకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట జిల్లా ఇన్‌చార్జి శ్రీకాంత్, 108 సిబ్బంది ఉన్నారు.

అంబరమంటిన సంబరం

ఎడపల్లిలో సద్దుల బతుకమ్మ





▲ బతుకమ్మను నిమజ్జనానికి తీసుకెళ్తున్న మహిళలు




ఎడపల్లి మండల కేంద్రంలో మంగళవారం సద్దుల బతుకమ్మను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం గ్రామంలోని మహిళలు తమ ఇంట్లో గునుగు పువ్వులతో తీర్చిదిద్దిన బతుకమ్మలను దేశ్‌ముఖ్ గడి వద్దకు తీసుకువచ్చారు. గౌరమ్మను చేసి పసుపు, కుంకుమలను పెట్టి కొబ్బరికాయలు కొట్టి బతుకమ్మ సంబరాలు ప్రారంభించారు. ఊరి ఆడపడుచులు అత్తాగారిళ్ల నుంచి తరలి వచ్చి బతుకమ్మ సంబరాల్లో పాలుపంచుకున్నారు. ఇతర గ్రామాల నుంచి మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో వచ్చి బతుకమ్మ సంబరాలను తిలకించారు. కోలాటాలు, ఆట పాటలతో బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటాయి. అనంతరం మహిళలు చెరువు వద్దకు ర్యాలీగా వెళ్లి బతుకమ్మలను నిమజ్జనం చేశారు. గునుగు పువ్వులతో చేసిన పెద్ద బతుకమ్మలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. మండల కేంద్రంలో బతుకమ్మ పండగ దసరా తర్వాత జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామ పెద్దలు చెప్పిన ప్రకారం.. గతంలో సద్దుల బతుకమ్మను నిమజ్జనం చేసే సమయంలో గన్ మిస్‌ఫైర్ కావడంతో దేశ్‌ముఖ్ వద్ద పనిచేసే సిపాయి మృతి చెందాడు. అరిష్టంగా భావించిన గ్రామస్తులు అప్పటి నుంచి బతుకమ్మ పండగ దసరా అనంతరం నిర్వహిస్తున్నారు.

– ఎడపల్లి(బోధన్)

బైబ్యాక్ ఒప్పందంపై అపనమ్మకం

- నష్టపోతూనే ఉన్న ఎర్రజొన్న రైతులు
- సలహాలు, సూచనలకే అధికారులు పరిమితం
- ఎత్తుగడలతో అయోమయానికి గురి చేస్తున్న వ్యాపారులు



ఆలూర్ రైతులకు వ్యాపారి రాసిచ్చిన బైబ్యాక్ ఒప్పంద పత్రం



కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు వినతిపత్రం అందజేస్తున్న వ్యాపారులు (ఫైల్)

ఆర్మూర్: ఫౌండేషన్ సీడ్ (పునాది విత్తనం) సరఫరా చేసిన నాటి నుంచి పంట దిగుబడి కొనుగోలు చేసే వరకు కాలికి వేస్తే మెడకు, మెడకు వేస్తే కాలికి అన్న చందంగా నిబద్ధత లేని రాతపూర్వక ఒప్పందాలతో వ్యాపారులు ఎర్రజొన్న రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. నాలుగు దశాబ్దాలుగా ఆర్మూర్ ప్రాంతంలో విత్తన వ్యాపారస్తులదే పైచేయి అవుతుండగా, రైతులు ఆర్థికంగా నష్టపోతూనే ఉన్నారు. విత్తన వ్యాపారులు సిండికేట్‌గా లేదా రెండు వర్గాలుగా మారి పంట దిగుబడి కొనుగోలు చేసే సమయంలో ధరను తగ్గించే ప్రయత్నాలు చేయడం మామూలు విషయంగా మారింది.

ఇటీవల జిల్లాకు చెందిన ఓ వర్గం విత్తన వ్యాపారులు జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును కలిశారు. రైతులతో ఎర్రజొన్న బై బ్యాక్ (విత్తనం సరఫరా చేసిన వ్యాపారే పంట దిగుబడి కొనుగోలు చేయాలి) ఒప్పందం చేసుకొనేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్, ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ ఆధ్వర్యంలో విత్తన వ్యాపారులు, వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి బడా సీడ్ వ్యాపారులెవరూ హాజరు కాలేదు.

ప్రభుత్వానిది ప్రేక్షక పాత్రే..

ఎర్రజొన్న వ్యాపారంలో ప్రభుత్వం పూర్తి స్థాయిలో కలగజేసుకోకుండా ప్రేక్షక పాత్రకు పరిమితం కావడం వ్యాపారులకు కలిసి వస్తోంది. వ్యాపారులు ఒప్పందం ప్రకారం డబ్బులు చెల్లించని పక్షంలో ప్రతి ఏడాది రైతులు ధర్నాలు చేయాల్సిన పరిస్థితులను చూస్తున్నాం. అధికారులు కేవలం సలహాలు, సూచనలు ఇచ్చేందుకే వ్యాపారస్తులు, రైతులతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయకుండా, ఎర్రజొన్న వ్యాపారంపై ప్రభుత్వం గుత్తాధిపత్యం సాధించి స్థిరమైన గిట్టుబాటు ధర సూచించినప్పుడే సమస్యకు శాశ్వత పరిష్కారం లభించి రైతులు లాభపడే పరిస్థితులు వస్తాయని రైతు నాయకులు అభిప్రాయపడుతున్నారు.

నిబద్ధతలేని ఒప్పందాలు

మరో వర్గానికి చెందిన వ్యాపారులు క్షేత్రస్థాయిలో రైతులతో నిబద్ధత లేని లోపాయికారి ఒప్పందాలు చేసుకోవడం ప్రారంభించారు. ఇటీవల ఆలూర్ మండలంలో రైతులతో చేసుకున్న రాతపూర్వక ఒప్పంద పత్రాల్లో క్వింటాలు ఎర్రజొన్నకు రూ.3 వేల ధరను నిర్ణయించి వారం రోజుల్లో డబ్బులు చెల్లిస్తామంటూ కథ్దా, విత్తనం ధర వివరాలను పొందుపరిచారు. ప్రస్తుత ఒప్పంద ధర కన్నా ఎర్రజొన్న ధర పెరిగితే మాత్రం రైతులు గ్రామాల వారీగా వేలం వేసుకోవచ్చంటూ ఒప్పంద పత్రం చివరలో మెలిక పెట్టడంతో రైతులు పునరాలోచనలో పడుతున్నారు. గతేడాది క్వింటాల్‌కు రూ.3500 నుంచి రూ.4 వేల ధర పలకగా, ఈ యేడాది కేవలం రూ.3 వేలుగా నిర్ణయించి ఒప్పందం పత్రాలు రాయడం వెనుక వ్యాపారుల ఎత్తుగడలు ఉండి ఉంటాయనే చర్చ సర్వత్రా జరుగుతోంది. ఇతర పంటలతో పోలిస్తే ఎర్రజొన్న క్వింటాల్ ధర రూ.3,500కు పైగానే పలికే అవకాశం ఉంది. ఒక వేళ ధర పెరిగితే బైబ్యాక్ ఒప్పందం చేసుకున్న వ్యాపారులు చేతులెత్తేసి అవకాశం ఉంది. ఇలా విత్తన వ్యాపారులు వారి స్వలాభాల కోసం ప్రతి ఏడాది ధరను తగ్గించేందుకు ఎత్తులకు పైఎత్తులు వేయడం సర్వసాధారణమైంది.

కొత్త టీచర్లకు పోస్టింగ్

- 464 మందికి కౌన్సెలింగ్
- అర్ధరాత్రి వరకు కొనసాగిన ప్రక్రియ



నియామక పత్రం అందజేస్తున్న డీఈవో దుర్గాప్రసాద్

నిజామాబాద్ అర్బన్ : జిల్లా విద్యాశాఖలో ఇటీవల నూతనంగా నియమితులైన టీచర్లకు మంగళవారం పోస్టింగ్ ఇచ్చారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోస్టింగ్‌ల కోసం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ ప్రక్రియ అర్ధరాత్రి వరకు కొనసాగింది. మొత్తం 601 పోస్టులకుగాను 464 భర్తీ చేశారు. ఇందులో 260 మంది ఎస్జీటీలు ఉన్నారు. ఖాళీలను ముందుగానే ప్రదర్శించారు. అభ్యర్థుల క్రమసంఖ్య ఆధారంగా పోస్టింగ్‌ల కోసం కౌన్సెలింగ్‌కు అనుమతించారు. కలెక్టరేట్ ప్రాంగణం నూతన ఉద్యోగులతో కిటకిటలాడింది.

వారి పరిస్థితి ఏమిటి..

నూతన టీచర్లు రావడంతో జిల్లాలోని గతంలో బదిలీ అయిన కొందరు ఎస్జీటీ టీచర్లను రిలీవ్ కావాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇలా జిల్లాలో 260 మంది ఎస్జీటీలు కొత్త ఉద్యోగస్తులుగా పాఠశాలల్లో చేరనున్నారు. అయితే కొన్ని ఎస్జీటీ ప్రాంతాలను ఖాళీల నివేదికలో చూపించలేదు. కాగా మరి కొన్ని చోట్ల ఖాళీలు లేకున్నా జాబితాలో చూపించారు. దీంతో ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు ఉన్నాయి.



అలీ సాగర్ నీటి విడుదల



ఎడపల్లి: మండలంలోని అలీ సాగర్ రిజర్వాయర్ ఒక గేటు ఎత్తి 300 క్యూసెక్కుల నీటిని ఇరిగేషన్ శాఖ అధికారులు దిగువకు వదులుతున్నారు. ఎగు వ నుంచి మంగళవారం అలీ సాగర్ రిజర్వాయర్ లోకి నీళ్లు రావడంతో అంతే మొత్తంలో నీటిని ఇరిగేషన్ శాఖ అధికారులు దిగువకు వదులుతున్నారు.

ఏఈవోలకు మెమోలు

డొంకేశ్వర్(ఆర్మూర్): కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న డిజిటల్ క్రాప్ సర్వే యాప్‌ను వెంటనే డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లాలోని 107 మంది వ్యవసాయ విస్తీర్ణ అధికారులకు (ఏఈవోలకు) మెమోలు జారీ అయ్యాయి. సర్వే చేయకపోతే క్రమశిక్షణ చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ శాఖ హెచ్చరించింది. సర్వే చేయకపోతే ఏకంగా టర్మినేట్ చేస్తామని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకూ స్పష్టం చేయడంపై ఏఈవోలు గుర్రుగా ఉన్నారు. సహాయ నిరాకరణను ఉధృతం చేయాలని, అవసరమైతే సామూహిక సెలవుల్లో వెళ్లాలనే భావనలో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమతో ఈ విధంగా ప్రవర్తించడాన్ని ఏఈవోల రాష్ట్ర కార్యవర్గం సీరియస్‌గా తీసుకుంది. ఒకటి రెండు రోజుల్లో ఉద్యమ కార్యచరణను ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

సర్వే చేయకపోతే చర్యలు

- 107 మంది అధికారులను హెచ్చరించిన వ్యవసాయశాఖ
- యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని ఒత్తిడి

అక్కడ సులభమే.. ఇక్కడ కష్టం

డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా సాగులో ఉన్న భూములు, పంటల రకాలు, విస్తీర్ణం లెక్కలను ప్రభుత్వం సులభంగా తెలుసుకోవచ్చు. డీసీఎస్ సర్వే దేశమంతా అన్ని రాష్ట్రాల్లో వ్యవసాయ శాఖ చేపడుతోంది. కానీ, తెలంగాణలోనే ఏఈవోలు దీనిని వ్యతిరేకిస్తున్నారు. ఒక్క ఏఈవో పరిధిలో ఐదువేల ఎకరాలకు మించి విస్తీర్ణం ఉండటమే దీనికి కారణం. ఒక్కరే అన్ని వేల ఎకరాలు సర్వే చేయడం కష్టమని ఏఈవోలు చెబుతున్నారు. గతంలో ఇచ్చిన ట్యాబ్‌లు పని చేయడం లేదని, అందరికీ అనువైన స్మార్ట్‌ఫోన్‌లు లేవని పేర్కొంటున్నారు. ఏపీ, మహారాష్ట్ర, యూపీ, ఒడిశా, కర్నాటక ప్రభుత్వాలు సహాయకులను నియమించి సర్వే చేయిస్తున్నాయని, కొన్ని చోట్ల ఏఈవోకు ఒక గ్రామాన్ని కేటాయిస్తున్నారంటున్నారు. వేరే రాష్ట్రాల్లో లాగే తమకు కూడా వెసులుబాటు కల్పిస్తే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని డిజి టల్ క్రాప్ సర్వేను చేస్తామని స్పష్టం చేస్తున్నారు. వ్యవసాయ శాఖ ఇచ్చిన మెమోలకు ఏఈవోలు తిరిగి ఇదే సమాధానాన్ని రాసి పంపారు. అధికారులు ఇదే విషయాన్ని ప్రభుత్వానికి నివేదించారు.

కేంద్రం నుంచి నిధుల కొరత లేదు



రివ్యూ... సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

నిజామాబాద్ అర్బన్: జిల్లాలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) పనులకు కేంద్రం నుంచి నిధుల కొరత లేదని, అన్ని పనులకు ముందస్తుగానే నిధులు డిపాజిట్ చేయడం జరిగిందని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వమే నిధుల విడుదలలో నిర్లక్ష్యం చేస్తోందన్నారు. అడవిమామిడిపల్లి వద్ద చేపట్టిన పనులకు రూ.23.6 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉండగా, ఇంత వరకు ఇవ్వలేదని, అయినప్పటికీ కాంట్రాక్టర్ పనులు పూర్తి చేస్తున్నారన్నారు. అర్సపల్లి ఆర్‌వోబీకి 3.5 ఎకరాల భూమిని క్లియరెన్స్ చేయాల్సి ఉండగా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. నవంబర్ 2 వరకు ఆర్మూర్, అడవి మామిడిపల్లి వద్ద అప్రోచ్ రోడ్డు పనులను పూర్తి చేస్తామని అధికారులు తెలిపారన్నా రు. వచ్చే ఏడాది జూన్ వరకు మాధవనగర్ ఆర్‌వో బీ పనులు పూర్తి చేస్తామన్నారు. ఆర్‌వోబీ పనులకు రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇచ్చి నిధులు మంజూరు చేయలన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ కార్పొరేటర్‌గా గెలువకున్నా విమర్శలు చేయడం సరికాదన్నారు. తన హయాంలో రైల్వే ఆర్‌వోబీలు, పసుపుబోర్డు, మద్దతు ధర వంటి అనేక పనులు పూర్తయ్యాయన్నారు. జిల్లాకు ఇంటిగ్రేటెడ్ పాఠశాలను తీసుకురావడంలో ఇక్కడి పాలకులు విఫలమయ్యారన్నారు. ఖమ్మం, నల్గొండకే అభివృద్ధి పనులు వెళ్తున్నాయని, జిల్లా నాయకులు ఏం చేస్తున్నట్లని విమర్శించారు.

పనులు పూర్తి చేయాలి

ఆర్వోబీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీ అర్వింద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. అడవిమామిడిపల్లి ఆర్‌వోబీ పనులకు సంబంధించి నిధుల కేటాయింపుపై సమీక్షించారు. ట్రాఫిక్ మళ్లింపు చేపడితే అప్రోచ్ పనులను పూర్తి చేస్తామని సంబంధిత కాంట్రాక్టర్ తెలుపగా, ట్రాఫిక్ మళ్లింపు చేపట్టాలని కలెక్టర్‌ను ఎంపీ ఆదేశించారు. మాధవనగర్ పనులను కూడా త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీ ఆదేశించారు. అర్సపల్లి ఆర్‌వోబీ పనులకు సంబంధించి మూడున్నర ఎకరాల స్థలం అప్పగించాలన్నారు. పనులపై సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఎంపీ కలెక్టర్‌కు సూచించారు. జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి దసరా ఆదాయం రూ.1.60 కోట్లు



ఖలీల్‌వాడి: ఆర్టీసీకి బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా రూ.1.60 కోట్ల ఆదాయం సమకూరింది. పండుగ సీజన్ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీ రెగ్యులర్‌గా నడిపే బస్సులకు అదనంగా 486 బస్సులను ఈనెల 1వ తేదీ నుంచి నడిపింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని మరో 60 బస్సులను పెంచింది. ప్రతి రోజూ నిజామాబాద్ నుంచి జేబీఎస్‌కు, జేబీఎస్ నుంచి నిజామాబాద్‌కు ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉండేలా ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. బుధవారం కూడా బస్సులు అందుబాటులో ఉంటాయని ఆర్టీసీ అధికారులు తెలిపారు. నిజామాబాద్ రీజియన్‌లోని ఆరు డిపోల నుంచి జేబీఎస్‌కు అలాగే ఇతర రూట్లలో ప్రత్యేక బస్సులను ఆర్టీసీ నడిపించింది. ఎక్స్‌ప్రెస్‌లకు తోడు సెమీలగ్జరీ, లగ్జరీ, సూపర్ లగ్జరీలను అందుబాటులో ఉంచగా, లక్ష మంది వరకు ప్రయాణికులు రాకపోకలు సా గించారు. ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ప్రయాణించినట్లు అధికారులు తెలిపారు.

నేడు ఒక్క రోజే ప్రత్యేక బస్సులు



దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా మొత్తం 486 ప్రత్యేక బస్సులను నడిపించాం. ప్రయాణికులకు ఇక్కట్లు లేకుండా బస్సులను అందుబాటులో ఉంచుతాం. పండుగ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని ఆరు డిపోల పరిధిలో లక్ష మంది వరకు ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు. నేడు(బుధవారం) సైతం ప్రత్యేక బస్సులు నడుస్తాయి. గురువారం నుంచి యథావిధిగా బస్సులను వివిధ రూట్లలో అందుబాటులో ఉంచుతాం.

– జానీరెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం, నిజామాబాద్

బాధ్యులు ఎవరు?

- బీజేపీ అధికారంలోకి వస్తుందనుకుంటే 8 సీట్లకే పరిమితం
- సొంత పార్టీ నేతలపై ఎంపీ అర్వింద్ పరోక్ష వ్యాఖ్యలు



నిజామాబాద్ అర్బన్ : గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందనుకుంటే కేవలం 8 సీట్లకు పరిమితమవడానికి కారణం ఎవరు? అంటూ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ వ్యాఖ్యానించారు. మంగళవారం ఆయన నిజామాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో 48 సీట్లు వచ్చినా అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం హైదరాబాద్ పరిధిలో ఒక్కసీటు కూడా ఎందుకు గెలువలేకపోయామని దీనిపై పార్టీ నాయకులు ఆలోచించాలన్నారు. కార్పొరేటర్లకు ఓటువేసినవారే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటువేశారని, కాని గెలవలేకపోవడం కారణం ఏమిటని సొంత పార్టీ నాయకులపై పరోక్ష విమర్శలు చేశారు. ఇందుకు బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. ప్రజలు బీజేపీని కోరుకుంటున్నారని ఓటు వేసి గెలిపించుకోవాలని ఉత్సాహంగా ఉన్నారన్నారు. ఇప్పటికైన అధికారంలోకి వచ్చేలా పార్టీ ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఒక్క ఎన్నికల్లో కూడా గెలువలేదని, ఇతరులు చెప్పిన మాటలు విని నా పై విమర్శలు చేయడం తగదన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే కాంగ్రెస్ పార్టీ డిపాజిట్ కూడా గల్లంతవుతుందన్నారు. ఇట్ల చేస్తేనే కేసీఆర్‌ను ప్రజలు ఖతం చేశారని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ మినహా మిగితా జిల్లాల్లో అక్కడక్కడ మాత్రమే గెలుపొందారని కేసీఆర్‌పై విమర్శలు చేశారు. కేసీఆర్ ప్రజాపాలన వ్యవస్థను నాశనం చేశాడని, దానిని సరిదిద్ది మంచి పాలన అందించేందుకు కాంగ్రెస్ ప్రయత్నం చేయాలన్నారు.

కొలువుల కేంద్రాలు లైబ్రరీలు

- ఉద్యోగార్థులకు వరంగా మారుతున్న గ్రంథాలయాలు
- అందుబాటులో అన్ని రకాల పుస్తకాలు, స్టడీ మెటీరియల్
- ఆహ్లాదకర వాతావరణంలో ప్రిపరేషన్
- గ్రంథాలయాల్లో ఎక్కువ సమయం కేటాయిస్తున్న నిరుద్యోగులు



గ్రంథాలయంలో చదువుతున్న నిరుద్యోగ అభ్యర్థులు(ఫైల్)

ఆర్మూర్‌టౌన్: గ్రంథాలయాలు.. కొలువుల కేంద్రాలుగా మారాయి. డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడిన వెంటనే నిరుద్యోగ యువత ఆర్మూర్ పట్టణంలోని గ్రంథాలయంలో పరీక్షకు ఉపయోగపడే పుస్తకాలతో కుస్తీలు పట్టి కొలువులు సాధించారు. ఆర్మూర్‌తో పాటు చుట్టు పక్కల గ్రామాల అభ్యర్థులు పోటీ పరీక్షల్లో ఉద్యోగం సాధించేందుకు గ్రంథాలయానికి క్యూ కడుతున్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 8గంటల వరకు అభ్యర్థులు ఏకదాటిగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో గ్రంథాలయంలో ప్రతిరోజు చదివే 20మంది అభ్యర్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. అలాగే గురుకులంలో ఏడుగురు, గ్రూప్–4లో 8మంది ఉద్యోగాలు సాధించారు. పోటీ పరీక్షలకు అవసరమయ్యే విజ్ఞాన పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉండడంతో ప్రతిరోజు సుమారు 200మంది అభ్యర్థులు గ్రంథాలయానికి వచ్చేవారు. గ్రంథాలయంలో అభ్యర్థుల సౌకర్యార్థం ఫ్రీ వైఫై, డ్రింకింగ్‌వాటర్ అందుబాటులో సిబ్బంది ఉంచేవారు. గ్రంథాలయానికి వచ్చే అభ్యర్థుల సంఖ్య పెరగడంతో అన్ని గదులను అందుబాటులోకి తీసుకువచ్చారు. మూడు గదులు, ఒక పుస్తకాల హాల్, ఆరు బయట అభ్యర్థులు చదివేందుకు సౌకర్యం కల్పించారు. గ్రంథాలయంపై నిర్మిస్తున్న భవనం త్వరలో అందుబాటులోకి వస్తే మరింత అభ్యర్థులు ఎక్కువ వచ్చి చదివే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు స్పందించి భవన నిర్మాణం త్వరగా వాడుకలోకి తీసుకురావాలని పలువురు పాఠకులు కోరుతున్నారు.



గ్రంథాలయంలో సన్నద్ధమై డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు

అన్ని రకాల పుస్తకాలున్నాయి



పోటీ పరీక్షలు సన్నద్ధమయ్యే అభ్యర్థుల కోసం అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. కష్టపడి చదివితే ఉద్యోగాలు సులువుగా సాధించొచ్చు. ప్రస్తుత డీఎస్సీలో 20 మంది అభ్యర్థులు కొలువు సాధించారు. అభ్యర్థులు ఉద్యోగాలు సాధించడంపై సంతోషంగా ఉంది.

–వరలక్ష్మి, గ్రంథాలయ పాలకులు

లైబ్రరీతోనే కొలువు



నేను డీఎస్సీలో ఉద్యోగం సాధించడానికి ఆర్మూర్ గ్రంథాలయం ఎంతగానో దోహదపడింది. నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి గ్రంథాలయం వేళలు ముగిసే వరకు కష్టపడి చదివాను. దినపత్రికల్లో వచ్చే కరెంట్ అఫైర్స్‌తో పాటు తెలుగు అకాడమీ పుస్తకాలు కొలువు సాధించడానికి ఉపయోగపడ్డాయి.

–రాజేశ్, ఆర్మూర్

అన్ని సౌకర్యాలు ఉన్నాయి



గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు చదువుకోడానికి అన్ని సౌకర్యాలు కల్పించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి.

– గోల్కొండ లింగయ్య, ఆర్మూర్

ఎన్‌డీసీసీబీ వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా



ఎన్‌డీసీసీబీ కార్యాలయం

సుభాష్‌నగర్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్(ఎన్‌డీసీసీబీ) వైస్ చైర్మన్ ఎన్నిక మంగళవారం వాయిదా పడింది. జిల్లా కేంద్రంలోని ప్రధాన కార్యాలయంలో వైస్ చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైన విషయం తెలిసిందే. ఎన్నికల అధికారిగా కామారెడ్డి జిల్లా సహకార అధికారి(డీసీవో) రామ్మోహన్ వ్యవహరించగా, ఎన్నికకు చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి సహా 17 మంది డైరెక్టర్లు హాజరయ్యారు. వైస్ చైర్మన్ ఎన్నికకు ఒక్క నామినేషన్ దాఖలు కాకపోవడంతో వాయిదా వేసినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఇదే విషయమై రాష్ట్ర సహకార శాఖ ఉన్నతాధికారులకు నివేదించినట్లు పేర్కొన్నారు. తిరిగి ఎన్నిక నిర్వహించే తేదీని ఉన్నతాధికారులు ప్రకటిస్తారని తెలిపారు.

ఏకాభిప్రాయానికి వచ్చినట్లే..!

ఎన్‌డీసీసీబీ చైర్మన్‌గా ఉన్న పోచారం భాస్కర్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన పరిణామాలతో రాజీనామా చేశారు. అనంతరం వైస్ చైర్మన్‌గా ఉన్న కుంట రమేశ్‌రెడ్డి చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నాటి నుంచి వైస్ చైర్మన్ పదవీ ఖాళీగా ఉంది. రాష్ట్ర సహకారశాఖ అధికారులు ఇటీవల వైస్ చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేశారు. చైర్మన్ పదవి నిజామాబాద్ జిల్లాకు ఇవ్వడంతో.. వైస్ చైర్మన్ పదవి కామారెడ్డి జిల్లాకు ఇవ్వాలని పట్టుబట్టినట్లు తెలుస్తోంది. తాజాగా మంగళవారం కూడా చర్చ జరిగినట్లు సమాచారం. ఈక్రమంలో ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధుల మధ్య వైస్ చైర్మన్ విషయంలో ఏకాభిప్రాయం కుదిరినట్లు తెలిసింది.

ఏఎంసీ చెక్‌పోస్టు ప్రారంభం



చెక్‌పోస్టును ప్రారంభిస్తున్న కాసుల బాలరాజు

రుద్రూర్: మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టును, స్థానిక సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ తారాబాయి, వర్ని మార్కెట్ కమిటీ చైర్మన్ కులకర్ణి సురేష్ బాబా, జడ్పీటీసీ మాజీ సభ్యుడు నరోజీ గంగారాం, విండో చైర్మన్ సంజీవరెడ్డి, మాజీ సర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్, బారీ, నిస్సార్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు డీఈలు బదిలీ

సుభాష్‌నగర్: విద్యుత్‌శాఖలో సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలో ఇద్దరు డీఈలు బదిలీ అయ్యారు. ఆర్మూర్ డీఈగా ఉన్న హరిచంద్‌ను నిర్మల్ ఎంఆర్‌టీ డీఈఈగా బదిలీ కాగా ఆయన స్థానంలో నిజామాబాద్ ఎంఆర్‌టీలో డీఈఈగా ఉన్న పీవీ రాజేశ్వర్‌రావును ఆర్మూర్‌కు ఉన్నతాధికారులు బదిలీ చేశారు.

మోపాల్ ఏఈ..

మోపాల్: మండల విద్యుత్‌శాఖ ఏఈ బాబా శ్రీనివాస్ నగరంలోని టౌన్–3 పరిధిలోని బోర్గాం(పి) ఏఈగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నగరంలోని డి–4 సెక్షన్ ఏఈగా ఉన్న నాగశర్వాణి బదిలీపై రానున్నారు. ఆమె మరో రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

ఇద్దరు నిందితుల అరెస్ట్

రుద్రూర్: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సిలిండర్లను చోరీ చేసిన ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సాయన్న మంగళవారం పేర్కొన్నారు. అంబేడ్కర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఇటీవల రెండు సిలిండర్లతో పాటు బియ్యం దొంగతనం జరిగింది. అంగన్‌వాడీ టీచర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో చోరీకి పాల్పడ్డ ఇద్దరిని గుర్తించి వారి నుంచి సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గ్యాస్ ఏజెన్సీ సిబ్బందిపై దాడి ఘటనలో..

బోధన్‌టౌన్: పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తున్న సిబ్బందిపై దాడిచేసిన వ్యక్తిపై పోలీసులు కేసునమోదు చేశారు. పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో పని చేస్తున్న రవి పట్టణంలోని గోషాలకు చెందిన ఓ కస్టమర్ ఇంట్లో కేవైసీ అప్‌డేట్ కోసం వెళ్లి వివరాలు కోరగా కస్టమర్ కొడుకు షేక్ ఎజాజ్ బయటకు వచ్చి రవిపై దాడి చేసి కొట్టాడు. బాధితుడు రవి ఫిర్యాదు మేరకు దాడి చేసిన వ్యక్తిపై కేసునమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ఎరాజ్‌పల్లిలో ఒకరి అదృశ్యం

బోధన్‌రూరల్: మండలంలోని ఎరాజ్‌పల్లికి చెందిన తెనుగు మహేశ్ అనే యువకుడు అదృశ్యమైనట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన మహేశ్ ఈ నెల 13న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. మహేశ్ భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మాచారెడ్డిలో యువతి..

మాచారెడ్డి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ యువతి సోమవారం అదృశ్యమైనట్లు ఎస్సై అనిల్ మంగళవారం తెలిపారు. కామారెడ్డిలో కంప్యూటర్ కోర్సు నేర్చుకునేందుకు వెళ్లిన యువతీ ఇంటికి తిరిగి రాలేదని కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

యువకుడిని కాపాడిన పోలీసులు

సిరికొండ: మండల కేంద్రానికి చెందిన శ్రీమంతుల భాను అనే యువకుడు మంగళవారం ఆత్మహత్యకు యత్నించగా ఎస్సై ఎల్‌రామ్ కాపాడారు. భాను కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకుంటానని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. భానుకు అన్న వరుసయ్యే సాయిచరణ్ ఈ విషయాన్ని ఎస్సైకి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశాడు. వెంటనే ఎస్సై భాను ఫోన్ నంబర్‌ను ట్రేస్ చేయగా పందిమడుగు శివారులోని అటవీ ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారు. అక్కడికి వెళ్లి గాలించగా భాను అప్పటికే పురుగుల మందు సేవించి ఉన్నట్లు గుర్తించి ఆస్పత్రికి తరలించారు.

నేడు స్వగ్రామానికి చేరనున్న కార్మికుడి మృతదేహం

ఇందల్వాయి: చంద్రాయన్‌పల్లి గ్రామానికి చెందిన బొండ్ల శ్రీనివాస్(39) 20 రోజుల క్రితం దుబాయిలో మతిస్థిమితం కోల్పోయి మృతి చెందాడు. అతని మృతదేహం నేడు స్వగ్రామానికి చేరుకోనుంది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని స్వదేశానికి రప్పించడంలో చంద్రాయన్‌పల్లి గ్రామస్తులు కృషి చేశారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సోమవారం రాత్రి, మంగళవారం జరిగిన వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతి చెందారు. ఆగిఉన్న లారీని ఢీకొని ఒకరు, బైక్ అదుపు తప్పి మరొకరు, ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి ఒకరు, బైక్‌పై నుంచి పడి మరొకరు మృతి చెందారు.

మాక్లూర్: జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన మాక్లూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని గౌతంనగర్‌కు చెందిన జంగంపల్లి బాబురావు(39) మేస్త్రీ పని చేస్తూ జీవిస్తున్నాడు. పని నిమిత్తం ఆర్మూర్ వెళ్లిన అతను మంగళవారం వేకువజామున నిజామాబాద్‌కు బైక్‌పై వస్తుండగా మాణిక్‌బండార్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతని తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య జంగంపల్లి లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరు..

ఆర్మూర్‌టౌన్: ఆలూర్ మండలం మచ్చర్ల శివారులో బైక్‌పై వెళ్తూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో మర్ల చిన్నయ్య(48) మంగళవారం మృతిచెందాడు. గ్రామానికి చెందిన చిన్నయ్య తన బైక్‌పై నందిపేట మండలం వన్నెల్(కె) గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. ఈ ఘటనలో చిన్నయ్యకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

అభంగపట్నంలో మరొకరు..

నవీపేట: మండలంలోని అభంగపట్నం శివారులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. బోధన్ మండలంలోని పెగడపల్లికి చెందిన మల్లవ్వ(32) తెలిసిన వ్యక్తితో కలిసి నిజామాబాద్‌కు వెళ్లినట్లు పేర్కొన్నారు. తిరుగు ప్రయాణంలో అభంగపట్నం శివారులో వెనుక కూర్చున్న మల్లవ్వ అదుపు తప్పి కిందపడింది. ఈ ఘటనలో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

బావిలో పడి ఒకరు..

సదాశివనగర్: ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడి ఒకరు మృతి చెందిన ఘటన సదాశివనగర్ మండలంలోని లింగంపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొలిపాక గణేశ్(36) సోమవారం సాయంత్రం తన వ్యవసాయ పొలానికి వెళ్లాడు. దాహం వేస్తుందని పొలం పక్కనే ఉన్న మోటబావిలో నీరు తాగేందుకు వెళ్లగా కాలు జారి నీటిలో పడి మృతి చెందాడు. మృతుడి భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

లింగంపల్లిలో కత్తితో దాడి

సదాశివనగర్: డబ్బుల విషయంలో ఇరువర్గాల మధ్య సోమవారం రాత్రి జరిగిన ఘర్షణలో ముగ్గురికి గాయాలైన ఘటన సదాశివనగర్ మండలంలోని లింగంపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గుండెల్లి మోహన్, గుండెల్లి సాయిలు, అనిల్‌కుమార్‌ను అదే గ్రామానికి చెందిన గుండెల్లి సంతోష్, ప్రదీప్, శ్రీకాంత్, ఆకాశ్ కత్తితో, చేతులతో దాడి చేశారు. ఈ ఘటనలో వారికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను స్థానికులు కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. సాయిలు పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్ పేర్కొన్నారు.

ముప్కాల్‌లో షార్ట్ సర్క్యూట్



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని పలు దుకాణాల్లో సోమవారం రాత్రి షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుంది. దీంతో పలు దుకాణాల్లోని సామాగ్రి దగ్ధమైంది. విద్యుత్ సరఫరాలో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ సంభవించిందని బాధితులు తెలిపారు. పలు ఇళ్లల్లో టీవీలు, ఫ్రిజ్‌లు కాలిపోయాయి. బైపాస్ రోడ్డు పక్కన ఉన్న ఓ పైపుల దుకాణంలో రూ. 60 వేల నష్టం వాటిల్లిందని నిర్వాహకుడు తెలిపాడు. ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యంతో ప్రమాదం సంభవించిందని బాధితులు ఆరోపించారు.

క్లుప్తంగా

టీచర్ ఉద్యోగాలు సాధించిన సిబ్బందికి సీపీ అభినందన



ఖలీల్‌వాడి: ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికైన పలువురు పోలీసు సిబ్బందిని సీపీ కల్మేశ్వర్ అభినందించారు. ఉపాధ్యాయులుగా ఎంపికైన పోలీసు సిబ్బంది సీపీని జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. విద్యాశాఖలో మంచి పేరు తీసుకురావాలని, పిల్లలకు మంచి చదువులు అందించి సూచించారు. డి మహేశ్(స్కూల్ అసిస్టెంట్), కె నాగేంద్రబాబు(ఎస్జీటీ), ఎం లిఖిత(ఎస్జీటీ), కె నాగరాజు(ఎస్జీటీ), డి సంధ్య(ఎస్జీటీ), ఎం వినోద్ కుమార్(ఎస్జీటీ), కె నవీన్ (పీఈటీ), పి హరీశ్(పీఈటీ)గా ఎంపికయ్యారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు కోటేశ్వర రావు, బస్వారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశాల గడువు పెంపు

నిజామాబాద్ అర్బన్: అంబేడ్కర్ యూనివర్సిటీలోని డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు అడ్మిషన్ల గడువును ఈ నెల 30 వరకు పెంచినట్లు కోఆర్డినేటర్ రంజిత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు సరైన ధ్రువపత్రాలతో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని స్టడీ సెంటర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆరుగురు కానిస్టేబుళ్ల బదిలీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్‌కమిషనరేట్ పరిధిలో ఆరుగురు కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ సీపీ కల్మేశ్వర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్ దివ్య నిజామాబాద్ ఆరో టౌన్ నుంచి బోధన్ టౌన్, వై లక్ష్మణ్ నిజామాబాద్ ఆరో టౌన్ నుంచి సిరికొండ, కె కిషన్ నిజామాబాద్ ఆరో టౌన్ నుంచి డిచ్‌పల్లి, ఎస్‌కే మహమ్మద్ ధర్పల్లి నుంచి బోధన్ టౌన్, జి అశోక్ సిరికొండ నుంచి బోధన్ టౌన్, ఎస్‌కే సౌకత్‌అలీ నిజామాబాద్ మూడో టౌన్ నుంచి మోర్తాడ్‌కు బదిలీ చేశారు.

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్

కామారెడ్డి టౌన్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌ను ఈ నెల 17న జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజన్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి హీరాలాల్ మంగళవారం పేర్కొన్నారు. అండర్–14, 17 విభాగాల్లో బాలురు, బాలికలకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు బోనాఫైడ్‌తో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9490015388 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఇద్దరు టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుళ్ల సస్పెన్షన్

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో అవినీతికి పాల్పడిన ఇద్దరు టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుళ్లు రాములు, సుధాకర్ సీపీ కల్మేశ్వర్ సస్పెండ్ చేసినట్లు తెలిసింది. అక్రమ దందాలను అరికట్టాల్సిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారికి వత్తాసు పలికినట్లు ఫిర్యాదులు అందడంతో విచారణ చేపట్టి సస్పెండ్ చేసినట్లు సమాచారం.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వ కృషి



ప్రాజెక్టులో చేపపిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే



పశువుల టీకాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ధర్పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. మండలంలోని రామడుగు ప్రాజెక్టులో ఎమ్మెల్యే భూపతిరెడ్డి, రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్‌తో కలిసి చేప పిల్లలను మంగళవారం నీటిలో వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం వంద శాతం రాయితీపై ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్ మాట్లాడుతూ.. మత్స్యకారులు దళారులను నమ్మి మోసపోవద్దని చేపలను నేరుగా మార్కెట్‌లో విక్రయించి లాభాలు పొందాలని సూచించారు. అనంతరం గ్రామంలో జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మండల కేంద్రంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పా గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, తహసీల్దార్ మాలతి, పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ బాలరాజు, నాయకులు మనోహర్‌రెడ్డి గంగారెడ్డి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే నంబర్ వన్

- ఎంపీ అర్వింద్ ధర్మపురి



సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

సుభాష్‌నగర్: బీజేపీ సభ్యత్వ నమోదులో నిజామాబాద్ పార్లమెంట్ రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థానంలో ఉందని, 94వేల మంది సభ్యత్వం పొందారని ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. మంగళవారం బీజేపీ సభ్యత్వ నమోదులో భాగంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారితో కలిసి నగరంలోని దుబ్బ, ఖలీల్‌వాడిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. గత సభ్యత్వ నమోదులోనూ నిజామాబాద్ మార్గదర్శకంగా నిలిచిందని, అందుకు పార్లమెంట్, అసెంబ్లీ ఫలితాలే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పంచరెడ్డి ప్రవళిక శ్రీధర్, బైకన్ సుధమధు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కష్టపడిన కార్యకర్తలకే గుర్తింపు

సుభాష్‌నగర్: బీజేపీలో కష్టపడిన కార్యకర్తలకే గుర్తింపు ఉంటుందని, రాబోయే స్థానిక, కార్పొరేషన్ ఎన్నికల్లో వారికే టికెట్లు దక్కుతాయని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని అర్బన్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యకర్తలు, నాయకులు, బూత్, మండల అధ్యక్షుల కృషితోనే సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే నిజామాబాద్ పార్లమెంట్ ముందంజలో ఉందన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యమని, కార్పొరేషన్‌ను ఈసారి కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తంచేశారు. అనంతరం ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి మాట్లాడారు. కార్యక్రమంలో బాల్‌రాజ్, స్రవంతి రెడ్డి, పంచరెడ్డి ప్రవళిక, పార్టీ మండలాల అధ్యక్షులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోధన్‌లో దొంగల హల్‌చల్

- వడ్ల వ్యాపారి ఇంట్లో రూ. 50 లక్షలు, 20 తులాల బంగారం చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం, ఏసీపీ

బోధన్‌టౌన్: బోధన్‌లో సోమవారం రాత్రి దొంగలు హల్‌చల్ సృష్టించారు. పట్టణంలోని శ్రీనివాసనగర్ కాలనీలో నివాసం ఉంటున్న వడ్ల వ్యాపారి ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడి రూ. 50 లక్షల నగదు, 20 తులాల బంగారం దోచుకెళ్లారు. మరో నాలుగు ఇళ్లలో చోరీకి యత్నించారు. సమాచారం అందుకున్న ఏసీపీ శ్రీనివాస్ సీఐ వెంకట నారాయణతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చోరీ జరిగిన తీరును బాధితుడిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్లూస్ టీంను రప్పించి వేలి ముద్రలు సేకరించారు. బాధితుడు వడ్ల వ్యాపారి శాఖమూరి వెంకటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటికి తాళం వేసి కుటుంబీకులతో హైదరాబాద్‌కు వెళ్లామని, మంగళవారం వేకువజామున ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపులు తెరిచి ఉన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు. ఇంట్లో బీరువాలో అప్పుగా తెచ్చిన రూ. 50 లక్షలు, 20 తులాల బంగారాన్ని దుండగులు చోరీకి పాల్పడినట్లు బాధితుడు పేర్కొన్నాడు. అనంతరం అదే కాలనీలో ఉన్న మరో నాలుగిళ్లల్లో చోరీకి యత్నించినట్లు తెలిపారు. క్లూస్‌టీం సేకరించిన ఆనవాలతో దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు

- అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్, రిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

బోధన్‌టౌన్: జల్సాలకు అలవాటు పడి ట్రాన్స్‌ఫార్మర్ల వైర్ల చోరీకి పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు రాష్ట్ర సరిహద్దు సాలూర చెక్‌పోస్ట్ వద్ద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బోధన్ రూరల్ సీఐ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర సరిహద్దు సాలూర చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురికి అదుపులోకి తీసుకొని విచారించగా బోధన్ సబ్‌డివిజన్ పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగితీగలను చోరీకి పాల్పడింది తామేనని ఒప్పుకున్నారు. మహారాష్ట్రకు చెందిన భీమ్‌రావ్ రంబౌ సరోదే, రాజు కుండ్లిక్రావ్ ఉగాలే, సంతోష్ బాబురావులను నిందితులుగా గుర్తించారు. వీరి నుంచి చోరీకి పాల్పడిన ట్రాన్స్‌ఫార్మర్ల వైర్లను, ఎర్టిగా కారు, చోరీకి పాల్పడే సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. బోధన్ సబ్‌డివిజన్ పరిధిలోని పీఎస్‌ల పరిధిలో 26 సార్లు చోరీలకు పాల్పడింది వీరేనని ఒప్పుకున్నట్లు ఏసీపీ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సిబ్బందిని ఏసీపీ అభినందించారు. త్వరలో వీరికి రివార్డులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సోమవారం రాత్రి, మంగళవారం వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. అనారోగ్యంతో ఇద్దరు, మద్యానికి బానిసై మరో ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారు.



మల్లవ్వ (ఫైల్)

రామారెడ్డి: అనారోగ్యంతో ఓ వివాహిత ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన రామారెడ్డి మండలంలోని ఇసన్నపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై నరేశ్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొంపల్లి మల్లవ్వ(22) మహిపాల్ భార్యాభర్తలు. వీరికి ఆరు నెలల కుమారుడు ఉన్నాడు. ఉపాధి నిమిత్తం మహిపాల్ గల్ఫ్‌కు వెళ్లాడు. కొంత కాలంగా మల్లవ్వ నరాల నొప్పితో బాధపడుతోంది. ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అనారోగ్యంతో ఒకరు..

ఎల్లారెడ్డి: అనారోగ్యంతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్లారెడ్డి మండలంలోని మల్లయ్యపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గడ్డం భూమయ్య(45) కొంత కాలంలో అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తితో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

చెరువులో దూకి మరొకరు..



గంగాధర్(ఫైల్)

ఎడపల్లి: ఇంట్లో జరిగిన గొడవలతో ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎడపల్లి మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామ చెరువులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గడ్డం గంగాధర్(55) సోమవారం రాత్రి మద్యం సేవించి కుటుంబీకులతో గొడవపడ్డాడు. మద్యం సేవించడంపై కుటుంబ సభ్యులు మందలించడంతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

మంజీర నదిలో దూకి..

బోధన్‌రూరల్: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన బోధన్ మండలంలోని ఖండ్‌గావ్ గ్రామంలో చోటు చేవసుకుంది. ఎస్సై మచ్చేందర్‌రెడ్డి మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చెన్నూరు గంగాధర్(38) మద్యానికి అలవాటు పడి, జీవితంపై విరక్తితో ఖండ్‌గావ్ శివారులోని మంజీర నది బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సాగర్‌బాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.